ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 26 ఏప్రిల్ 2025 | 3



అమలాపురం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 36.0 (శుక్రవారం)

కనిష్ఠం : 30

'ఉగ్ర' దాడిని నిరసిస్తూ..

6

కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పెద్దఎత్తున ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం కూడా ఈ దమనకాండను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలోను, సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలోనూ కొవొత్తుల ప్రదర్శనలు నిర్వహించారు. మృతి చెందిన వారికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తంచేశారు. పలుచోట్ల ముస్లింల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ఈ ఘటనకు నిరసన వ్యక్తంచేశారు.



అంబాజీపేటలోని మసీదు వద్ద శుక్రవారం జాతీయ పతాకాలతో ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి నివాళులు అర్పిస్తున్న ముస్లింలు



పహల్గాంలో ఉగ్రవాదుల పాశవిక హత్యాకాండను నిరసిస్తూ అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో శుక్రవారం జనసేన ఆధ్వర్యంలో ప్రదర్శన చేస్తున్న దృశ్యం



మీ కోసం నేనున్నాను : అభిమానులకు పవన్ అభివాదం

మా బాబే బాగున్నావా : పవన్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న మహిళ



మీ ప్రేమకు.. అభివందనం!

10 నెలలు.. పిఠాపురంలో రూ.100 కోట్ల అభివృద్ధి

- మాట నిలబెట్టుకుంటున్నాం
- పిఠాపురం అభివృద్ధి చేస్తున్నాం
- ఆర్వోబీ పనులకు టెండర్లు
- శాంతిభద్రతలపై రాజీ లేదు
- తప్పుచేస్తే ఉపేక్షించం
- పెద్దాసుపత్రికి శంకుస్థాపన
- అంతా కలిసి పనిచేస్తాం
- పవన్ సుడిగాలి పర్యటన

(కాకినాడ/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నాం.. నూరు శాతం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. గడచిన పది నెలల్లో పిఠాపురం నియోజకవర్గంలో రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తద్వారా 25 వేల మందికి పని కల్పించామని తెలిపారు. మూడు లక్షల మంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పిఠాపురం ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ అనుమతిచ్చారని త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని ప్రకటించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడగా ఆర్వోబీ నిర్మాణానికి నిధులివ్వడానికి అంగీకరించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ, కూటమి నేతలతో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు. క్రిమినల్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. పవన్‌కల్యాణ్ ఉదయం 9.30 గంటలకు పిఠాపురం చేరుకోవాల్సి ఉండగా మూడు గంటల ఆలస్యంగా 12.27 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద నాయకులు, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అయితే నాయకులు హెలికాప్టర్ వద్దకు రాగా పైలట్ వారిని వెనక్కు వెళ్లాలని కాస్త విసురుగా చెప్పారు. ఇది చూసిన పవన్ నేతలను హెలీకాప్టర్ వద్దకు రమ్మని, పైలట్ వైపు చూస్తూ నేతలను ఏమీ అనవద్దని సూచించారు. పవన్ రోడ్డు మార్గాన పిఠాపురం వస్తూ యండపల్లి, కొండెవరం, నవఖండ్రవాడ తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న వారిని చూసి ఆగి వారి సమస్యలు తెలుసుకున్నారు. పిఠాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మహిళల ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు, రోటావేటర్లు, కిసాన్ డ్రోన్ పంపిణీ చేశారు.ముస్లింలు, మహిళలను కలిశారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నియోజకవర్గంలోని సీసీ రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రోడ్లు, గోకులాలును ప్రారంభించారు.అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ అరగంటకు పైగా కార్‌వ్యాన్‌లో ఉండిపోయి అనంతరం హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయం, అక్కడ నుంచి విజయవాడ చేరుకున్నారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జేసీ రాహుల్ మీనా,జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పాడా పీడీ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

అభివృద్ధి ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో రూ.18.02 కోట్లతో 31.59 కి.మీల మేర 276 సిమెంట్ రోడ్లు నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించామని పవన్‌కల్యాణ్ అన్నారు. 5.21 కి.మీల పొడవునా ఏడు తారురోడ్లను రూ.3.20 కోట్లతో పూర్తి చేశామని, వీటి ద్వారా 300 మంది కాంట్రాక్టర్లకు, 5 వేల మంది శ్రామికులకు పనికల్పించామన్నారు. 434 గోదాంలతోపాటు వివిధ పనుల నిమిత్తం రూ.8.68 కోట్లు వ్యయం చేశామన్నారు. మరో రూ.21.58 కోట్లతో చేపట్టిన పనులు మరో మూడు నెలల్లో పూర్తవనున్నాయన్నారు. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. 225 ఏళ్ల చరిత్ర కలిగిన గొల్లప్రోలు సీతారామ స్వామి దేవస్థానంలో రూ.1.32 కోట్లతో ప్రాకార మండపం నిర్మిస్తున్నామన్నారు. చేబ్రోలు సీతా రామస్వామి దేవస్థానంలో కాలక్షేప మంటపం, రథశాల నిర్మిస్తున్నామని, మహిళలకు ఉచిత దర్జీ శిక్షణ ఇచ్చి 3,456 కుట్టుమిషన్లు ఉచితంగా అందజేస్తామన్నారు. రైతులకు రూ.26లక్షల వ్యయంతో రెండు వేల టార్పాలిన్లు అందజేస్తామని, రూ.1.94 కోట్లు వ్యయంతో 14 రోటోవీటర్లు, 39 పవర్‌టిల్లర్లు, 50 స్ప్రేయర్లు, కిసాన్ డ్రోన్లను రైతులకు అందజేస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల 25 వేల ఎకరాల పంటకు ప్రయోజనం కలుగుతుందన్నారు.



ఆసుపత్రి ఇలా..

పిఠాపురం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పవన్ వైద్యాధికారులతో మాట్లాడారు. ఆసుపత్రి నిర్మాణం ఏ విధంగ ఉండబోతోందో అధికారులు ప్రజంటేషన్ ఇస్తుండగా.. ఆసుపత్రి అందంగా, ఆరోగ్యంగా ఉండాలంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో పిఠాపురం బిడ్డ పవన్ అని కొందరు నినదించగా నవ్వుకుంటూ ముందుకు సాగారు.

పోలీసులు వర్సెస్ వర్మ

పిఠాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద పోలీసులకు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వర్మతోపాటు వచ్చిన టీడీపీ నేతలను పోలీసులు లోపలకు అనుమతించలేదు. దీనిపై వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని అనుమతించకపోతే తాను వెళ్లిపోతానని వర్మ హెచ్చరించడంతో ఎస్పీ బిందుమాధవ్ సముదాయించారు.

నిధుల విడుదల ఇలా..

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థ మెరుగుదల, ఇతర పనుల నిమిత్తం ప్రత్యేక గ్రాంటుగా మునిసిపల్‌శాఖ మంత్రి నారాయణ రూ.4 కోట్లు మంజూరు చేశారని పవన్ చెప్పారు. వీటితో త్వరలోనే పనులు చేపడతామన్నారు. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఓహెచ్ఎస్ఆర్, పైప్‌లైన్ల మరమ్మతులు, మురుగునీటి నిర్వహణకు కాకినాడ ఎంపీ నిధులు నుంచి రూ.50 లక్షలు, హౌసింగ్ నుంచి రూ.50 లక్షలు కేటాయించినట్టు చెప్పారు.



రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో పంట కాలువ ఇలా..

కాల్వలు.. క్లీన్‌గా!

వేసవిలో పంట కాల్వలకు మరమ్మతులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం అంటే ఎలా ఉండాలి.. ప్రజల సమస్యలు పరిష్కరించాలి.. ప్రజలకు సమస్యలు రాకుండా చూసుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వం అదే చేస్తోంది. దీనిలో భాగంగా పంట కాల్వలపై అభివృద్ధిపై దృష్టి పెట్టింది.. గత వైసీపీ ప్రభుత్వంలో అయితే ఐదేళ్లూ ఆ ఊసే లేదు. నీటి సంఘాలను పట్టించుకోలేదు. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సీజన్‌లో కాలువల ద్వారా నీరందక రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వైపు భారీవర్షాల వల్ల ముంపు ఏర్పడినపుడు చేలలలోని నీరు తిరిగి, బోదుల గుండా బయటకు వచ్చే వీలు లేక నష్టాల పాలయ్యారు. రేపో ఎల్లుండో కాల్వలు కట్టివేయనున్నారు. ఈ నేపథ్యంలో పంట కాల్వల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.


పంట కాల్వల ఆధునికీకరణకు..

ధవళేశ్వరం బ్యారేజి పరిధిలో తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలతోపాటు, వాటి పిల్ల కాలువలు, బోదెలు ఉంటాయి. అవన్నీ శుభ్రంగా, పటిష్ఠంగా ఉంటేనే నీరుపారుదల సక్రమంగా ఉంటుంది. గోదావరి బ్యారేజీ నుంచి కాలువల్లోకి వెళ్లిన నీరు సులభంగా పంటబోదెల ద్వారా చేలల్లోకి చేరుతోంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి ఏటా సమ్మర్‌లో కాలువల ఆపరేషన్ అండ్ మెయింట్‌నెన్స్ (ఓ అండ్‌ఎం) నిధులు ఇచ్చి నీటి సంఘాలతో పనులు చేయించేవారు. ఈ ఏడాది అదే విధానాన్ని అవలంబించనున్నారు. ఈమేరకు ముందస్తుగా నీటి సంఘాలను ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు, కొవ్వూరు డివిజన్‌లో మొత్తం నీటి సంఘాలు 432 ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లు 37, ప్రాజెక్టు కమిటీ (పీసీ)లు 8 ఉన్నాయి. అందులో తూర్పుగోదావరి జిల్లాలో నీటి సంఘాలు 113, డీసీలు 6, పీసీలు 2 ఉన్నాయి. అలాగే అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నీటి సంఘాలు 83, డీసీలు 14, పీసీ 1 ఉంది. కాకినాడ జిల్లాలో నీటి సంఘాలు 236, డీసీలు 17, పీసీలు 5 ఉన్నాయి. ప్రస్తుతం రూ.10 లక్షల్లోపు కాలువల అభివృద్ధి పనులన్నీ వీరి ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. డీసీలు,పీసీల సలహాల మేరకు పెద్ద పనులపై అధికారులు నిర్ణయం తీసుకుంటారు.

అసెంబ్లీ	పనులు	నిధులు(కోట్లు)
అమలాపురం	107	3.5 కోట్లు
కాకినాడ రూరల్	53	1.9
కొత్తపేట	68	2.9
మండపేట	67	2.6
ముమ్మడివరం	85	3.4
పి.గన్నవరం	53	2.4
పెద్దాపురం	51	2.3
రామచంద్రపురం	79	2.9
రాజోలు	61	2.5
జగ్గంపేట	31	2.0
పిఠాపురం		3.9
అనపర్తి	31	1.17
కొవ్వూరు	28	2.02
రాజమండ్రి రూరల్	10	62.8 లక్షలు
ప్రత్తిపాడు	26	99.86 లక్షలు
రంపచోడవరం	3	23.99 లక్షలు
తుని	35	74.98 లక్షలు
గోపాలపురం	16	92.02 లక్షలు


మొత్తం 1742 పనులకు రూ.68.64 కోట్లతో పనులు ప్రతిపాదించారు. రెండు మూడు రోజుల్లో శాంక్షన్ ఉత్తర్వులు వస్తాయని ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఈ గోపినాథ్ తెలిపారు. పనులన్నీ ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు, మంత్రుల సలహాలు, సూచనల మేరకు ప్రతిపాదించారు.

- 1747 పనులకు నివేదిక
- 66.64 కోట్ల ప్రతిపాదనలు
- రెండు రోజుల్లో క్లియరెన్స్
- 33 నియోజకవర్గాలపై దృష్టి
- తూడు తొలగింపు చర్యలు
- రేపు కాల్వల మూసివేత
- 10 లక్షల్లోపు నీటి సంఘాలకు
- కాలువల పొడవు 4 వేల కి.మీ



రేపు కాలువల మూత

ధవళేశ్వరం సర్కిల్ పరిధిలో తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువలకు ఈనెల 27 నుంచి నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ నేపథ్యంలో కాలువల అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ధవళేశ్వరం గోదావరి పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా 33 నియోజకవర్గాల్లో రూ.68.64 కోట్లతో 1747 పనులు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రెండు మూడు రోజుల్లో వాటికి అనుమతి తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.ఉత్తర్వులు వచ్చిన వెంటనే కాలు వల్లో నీరు తగ్గిన తర్వాత నీటి సంఘాలు పనులు చేపడతాయి.అసెంబ్లీ నియోజకవర్గాల వారీ పనులు గుర్తించారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పంట కాలువలు, పిల్లకాలువలు సుమారు 4 వేల కి.మీ మేర ఉంటాయి.



ధవళేశ్వరం వద్ద నిండుగా గోదావరి కాల్వ



అంబాజీపేట మండలం మొసలపల్లిలో రైతుల కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొన్న రెండ్రోజుల్లోనే రైతుల ఖాతాకు సొమ్ములు

కలెక్టర్ మహేష్‌కుమార్

అంబాజీపేట, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేయడం జరిగిందని, ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లో రైతుల ఖాతాకు సొమ్ములు జమచేసే విధంగా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లిలో ఆయన రైతు కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ధాన్యం విక్రయాలకు సంబంధించి రైతు వారీగా కల్లాల్లో గోనె సంచుల్లో నింపుతున్న ప్రక్రియను ఆయన పరిశీలలించారు. గోనెసంచులు, సరఫరాపై ఆరా తీశారు. గోనెసంచుల్లో నింపిన ధాన్యం తేమ శాతం, నాణ్యత, తరుగు తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల ఇతర లైన్ డిపార్టుమెంట్ల భాగస్వామ్యంతో ధాన్యం సేకరణ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం నమూనాలను కొనుగోలు కేంద్రాలకు అందించి దానికి అనుగుణంగా గిట్టుబాటు ధరలను పొందాలని సూచించారు. రైతుల కష్టాన్ని దళారుల పాలు కాకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సమస్యలు తలెత్తినట్టయితే జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ సెల్ నెంబరు 8309432487, 9441692275 నెంబర్లలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు.





ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద మహిళల ముట్టడిని అడ్డుకుంటున్న పోలీసులు.. ఓఎన్జీసీ రోడ్డులో ధర్నా వద్ద అధికారుల చర్చలు

ఓడలరేవులో ఓఎన్జీసీ టెర్మినల్ ముట్టడిలో ఉద్రిక్తత

అల్లవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కృష్ణా గోదావరి బేసిన్ పరిధిలో దక్షిణ భారతదేశంలో చమురు ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్‌ను మహిళలు, గ్రామస్థులు శుక్రవారం ముట్టడించడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్పీఎఫ్ సీఐ పి.రంజిత్‌కుమార్, ఎస్ఐలు టి.తిరుమలరావు, ఎం.శ్రీరాములు సాయుధ పోలీసు బలగాలతో ముట్టడిని అడ్డుకున్నారు. 40 ఏళ్లుగా ఓడలరేవు నుంచి రూ.లక్ష కోట్ల చమురు ఉత్పత్తులు తరలించుకుపోతున్న ఓఎన్జీసీ సంస్థ ఓడలరేవు గ్రామాభివృద్ధి పట్ల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ 54 రోజులుగా గ్రామస్థులు, మహిళలు రిలే దీక్షల ద్వారా నిరసనలు తెలుపుతున్నారు. ఆగ్రహంతో ఉన్న గ్రామస్థులు ఓడలరేవు ఓఎన్జీసీ రోడ్డుపై ధర్నాకు దిగడంతో కలకలం రేగింది. మార్చి 27న ఓఎన్జీసీ అధికారులు అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో చర్చలు జరిపి, వారం గడువు కోరి ఆలస్యం చేయడంతో సహనం కోల్పోయిన గ్రామస్థులు, మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. మహిళలు భోజనాలు తినకుండా ఆగ్రహంతో ఓఎన్జీసీ టెర్మినల్ గేటు ముట్టడికి మూకుమ్మడిగా తోసుకువెళ్లడంతో సీఐలు డి.ప్రశాంత్‌కుమార్, రంజిత్‌కుమార్ వారిని అడ్డుకునే ప్రయత్నంచేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, పచ్చిమాల ఏడుకొండలు గ్రామస్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. గత వైసీపీ పాలనలో కొందరికే ఓఎన్జీసీలో ఉద్యోగాలిచ్చారని, స్థానికులకు అన్యాయం చేశారంటూ దెందుకూరి ఆరోపించారు. కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకటరామకృష్ణ, నాతి లెనిన్‌బాబు, సోమాని వెంకటరమణ, గుండుమేను శ్రీనివాస్, కామాడి గంగాభవానీ, కొల్లు శుభకీర్తి, బడుగు గౌరీ తదితరులు ఓఎన్జీసీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఓఎన్జీసీ రెసిడెంట్ ఇన్‌చార్జి భరత్‌భూషణ్, ఎస్ఈ హేమనాథ్, ఓఎన్జీసీ అధికారులు గ్రామస్థులతో చర్చలు జరిపారు. వారం రోజులు గడువు ఇవ్వాలంటూ ఓఎన్జీసీ అధికారులు కోరినా ససేమిరా వినలేదు. దీంతో ఈనెల 29న చర్చలకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో రహదారుల అభివృద్ధి

- మొదటి దశలో జొన్నాడ-కాకినాడ రహదారికి శ్రీకారం
- రెండవ దశలో కోనసీమ జిల్లాలో సాగుతున్న సర్వే



పి.గన్నవరం అక్విడెక్టుపై సర్వే చేస్తున్న సిబ్బంది, ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర

పి.గన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రంలోని ఆర్అండ్‌బీ రహదారులను అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలి విడతగా రాష్ట్రంలోని కొన్ని రహదారుల్లో సర్వే నిర్వహించగా రెండో విడతలో మరి కొన్ని రహదారులను సూచిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈనేపథ్యంలో పూర్తి స్థాయిలో సర్వే చేయడంతోపాటు ఆయా జిల్లాల పరిధిలోని ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ క్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండు రహదారులను లీ- అసోసియేట్స్ సంస్థ ద్వారా సర్వే చేసే విధంగా ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొదటి విడతగా జొన్నాడ-కాకినాడ (సుమారు 60 కిలోమీటర్లు) రహదారిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ రహదారికి సంబంధించి ఓ ప్రైవేటు సంస్థ సర్వే పూర్తి చేసిందని తెలిసింది. రెండో విడతగా కోనసీమ జిల్లాలో రాజవరం-పొదలాడ (సుమారు 61.425 కిలోమీటర్లు), అమలాపురం-బొబ్బర్లంక (59.5 కిలోమీటర్లు) రహదారులను అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు లీ-అసోసియేట్స్ సంస్థ ప్రతినిధులు రాజవరం-పొదలాడ రహదారిలో పి.గన్నవరం ప్రధాన రహదారి, అక్విడెక్టు పరిసరాల్లో నిర్వహించారు. ఈ సర్వేను ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర పరిశీలించి పలు అంశాలపై వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సర్వేలో ముఖ్యంగా ట్రాఫిక్ అంశాలను పరిశీలిస్తారు. సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. అనంతరం అభివృద్ధి బాధ్యత అప్పగించనుంది.

ఊరిస్తోంది.. ఊరగాయ!





వేసవికాలం వచ్చిందంటే గోదావరి జిల్లాల్లో ఊరగాయల సందడి వచ్చేస్తుంది. ముఖ్యంగా ఆవకాయకు కేరాఫ్ అడ్రస్‌గా రాజమహేంద్రవరం ఉంటుంది. ఇతర ప్రాంతాలతో పోల్చితే రాజమహేంద్రవరం పరిసర గ్రామాల్లో మామిడి పంట అధికంగా ఉండడమే కారణం. మామిడితోపాటు టమాట, మిర్చి ఆవకాయ, దబ్బకాయ, నిమ్మకాయ, ఉసిరికాయ, ములక్కాయ, గోంగూర, కొత్తిమీర, పచ్చళ్లు ఎండాకాలంలోనే పట్టడానికి అనుకూలం. అందుకే వేసవికాలం ఊరగాయల కాలం అని మన పెద్దలు అంటుంటారు.

- ఎక్కడ చూసినా పచ్చళ్ల హడావుడే.. మార్కెట్‌లో అంతా ఇదే సందడి
- పచ్చడి రకం మామిడికాయ రూ.10 నుంచి రూ.25 వరకు ధర

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు అమితంగా ఇష్టపడే ఆహార పదార్థాల్లో పచ్చళ్లు కూడా చాలా ముఖ్యం. వేసవికాలంలో పచ్చళ్లు పడితే మూడు కాలాలపాటు అవి నిలిచి ఉండి మళ్లీ పచ్చళ్లు పట్టే సమయానికి జాడీలు అడుగంటుతాయి. ఆ విధంగా నాన్నమ్మలు, తాతమ్మలు, అమ్మమ్మలు పచ్చళ్లను నిల్వ చేసుకునేలా సిద్ధం చేసేవారు. అందుకే వేసవి ఆరంభంతోనే పచ్చళ్ల సందడి ప్రతి ఏటా మొదలవుతుంది. రాజమహేంద్రవరం ఆవకాయపచ్చడి మార్కెట్లు చాలా ప్రసిద్ధి. పచ్చడి సరుకులన్నీ హోల్‌సేల్ ధరలకే ఇక్కడ లభ్యమవడం, అన్ని రకాల పచ్చడి మామిడికాయ కూడా పెద్దఎత్తున దిగుమతి కావడంతో సమీప ప్రాంతాల నుంచి ఈ సీజన్‌లో మార్కెట్‌కు తరలివస్తారు. పట్టిన పచ్చళ్లు కొనుగోలు చేసుకునే సంస్కృతి పెరుగుతున్నా ఇప్పటికీ అన్ని రకాల నాణ్యమైన దినుసులతో, గానుగ నూనెతో ఊరగాయలు పట్టడానికే ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. పాత పద్ధతినే అనుసరిస్తూ కష్టమైనా పచ్చడి పట్టుకుని తమతోపాటు బంధుమిత్రులకు పంపించే పరిస్థితి కొనసాగుతోంది. ధరలు అంతకంతకూ పెరుగుతుండడంతో తక్కువ పరిమాణంలోనైనా ఆవకాయ, మాగాయ పట్టుకోవాలని చాలామంది ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సగటున 25 మామిడికాయలు కొనుగోలు చేసుకుని వాటిలోకి పచ్చడి మిరపకాయలు కిలో రూ.300కు కొనుగోలు చేసి వాటిలోకి నువ్వుల నూనె లేదా వేరుసెనగ నూనెను వాడుకునేలా సిద్ధం చేసుకోవడంతోపాటు వెల్లుల్లి, ఆవాలు, మెంతులు తదితర పచ్చడి దినుసులన్నీ కొనుగోలు చేసుకోవడానికి మొత్తం రూ.3 వేల వరకు ఖర్చవుతోంది.

మార్కెట్ యార్డుకు పోటెత్తుతున్న మామిడి



ఆవకాయ పేరుచెబితే మామిడితో కొన్ని రకాల కాయలకు ప్రత్యేకమైన డిమాండ్ ఉంటుంది. రాజమహేంద్రవరం మార్కెట్‌లో ఆవకాయ, మాగాయ, తొక్కుడు, బెల్లం ఆవకాయ పచ్చళ్లకు అవసరమైన మామిడికాయలు అందుబాటులో ఉన్నాయి. ఆవకాయకు కొత్తపల్లి కొబ్బరి బాగా ఫేమస్. ఆ తర్వాత నీలాలు, రసాలను వినియోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌కు ఆయా రకాల మామిడికాయలు చేరుకుంటున్నాయి. అయితే రాజమహేంద్రవరం మార్కెట్‌కు దూర ప్రాంతాల నుంచి మామిడికాయలను దిగుమతి చేసుకునే అవసరం లేదు. ఎందుకంటే తూర్పుగోదావరి జిల్లాలోనే గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోనే పెద్దఎత్తున మామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటల నుంచే మామిడి కాయలు రాజమహేంద్రవరం మార్కెట్ యార్డుకు ప్రతి ఏటా తరలివస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో సరుకు దిగుమతి ఊపందుకుంది. ప్రస్తుత మార్కెట్‌లో పచ్చళ్లకు వినియోగించే మామిడి కాయల ధరలు కాయ రూ.10 మొదలుకొని రూ.25 వరకు ఉంది. రకాలు, వాటి నాణ్యతను బట్టి రెట్లు పెరుగుతున్నాయి. కొత్తపల్లి కొబ్బరి మామిడి కాయ ఒకటి రూ20 వరకు పలుకుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చడి కాయల సందడి కూడా మొదలైంది. మే మొదటి వారంలో మరింతగా పచ్చడి కాయలకు డిమాండ్ పెరగనుంది. ఇప్పటికే కాయలు కొనుగోలు చేసుకుని వాటిని ముక్కలు కొట్టే వారి వద్దకు తీసుకుని వెళ్లి నచ్చిన సైజులో ముక్కలు కొట్టించి పచ్చడి పట్టుకునే పనిలో మహిళలు నిమగ్నమయ్యారు.

హామీ నెరవేర్చారు!



అన్నవరం దేవస్థానంలో 74 మంది నాయీబ్రాహ్మణులకు శుభవార్త

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కేశఖండనశాల నాయీబ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. దేవస్థానంలో 74 మంది నాయీబ్రాహ్మణులుండగా వీరికి దేవస్థానం నుంచి రూ.20వేల వేతనం అందిస్తున్నారు. చంద్రబాబు ఎన్నికల హామీల్లో భాగంగా ఈ వేతనాన్ని రూ.25వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పెంచిన జీతాలు జూన్ నుంచి అమలులోకి రానున్నాయి. మొదట్లో నాయీబ్రాహ్మణులు కేశఖండన టిక్కెట్లపై వచ్చే కమిషన్‌తో విధులు నిర్వహించేవారు. మొదట్లో రూ.2 కమిషన్ ఉండగా క్రమేపీ రూ.25కి పెంచారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని రూ.20 వేల వేతనంగా మార్చగా, కూటమి ప్రభుత్వం రూ.25వేలకు పెంచింది.

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సత్కరిస్తున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ నాయీబ్రాహ్మణులు

నాయీబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలు.. జీవో జారీచేసిన ప్రభుత్వం

ఆత్రేయపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో నాయీబ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అమలుచేశారు. ఎన్నో ఏళ్లుగా దేవుడి సేవలో ఉంటూ నాయీబ్రాహ్మణ వృత్తినే కొనసాగిస్తూ వస్తున్న వారికి రూ.25 వేలు కనీస వేతనంగా అమలుచేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని జీవో జారీచేసింది. ఈ జీవోపై నాయీబ్రాహ్మణులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. రూ.50లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఆదాయం వచ్చే 44 దేవాలయాలు 'ఏ' కేటగిరిలో ఉన్నాయి. వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం డిప్యూటీ కమిషనరు హోదాకు చేరుకుంది. వార్షిక ఆదాయం రూ.30 కోట్లపైమాటే. గతంలో శ్రీ వేంకటేశ్వర నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సుమారు 17 మంది ఎన్నో ఏళ్లుగా భక్తులకు తలనీలాలు తొలగించే సేవలో కొనసాగారు. గతంలో టిక్కెట్టు రూ.25కు తలనీలాల సమర్పించే భక్తుల నుంచి సేకరించగా ఆ టిక్కెట్టు కమిషను రూ.25 నాయీబ్రాహ్మణులకు అందించేవారు. ఇలా నెలకు రూ.7వేల నుంచి రూ.8 వేల ఆదాయం వచ్చేది. ఆ కమిషన్‌తోనే కుటుంబాలు పోషించుకునేవారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరి సేవలను గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లడంతో గత ప్రభుత్వం రూ.20 వేల వేతనం అందించింది. దీన్ని కూటమి ప్రభుత్వం రూ.25 వేల వేతనానికి పెంచుతూ తాజాగా జీవో జారీచేసింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావును వీరంతా సత్కరించారు.





కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఎన్నో ఏళ్లుగా దేవుడి సేవలో నిమగ్నమై ఉన్న తమకు కనీస వేతనం కోసం పోరాటం సాగించాం. చాలీచాలని వేతనాలతో దేవుడినే నమ్ముకుని భక్తులకు సేవలందిస్తూ వచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం రూ.25 వేలు కనీస వేతనం పెంచుతూ జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నాం. - రౌతు సురేష్, వెంకటేశ్వర నాయీబాహ్మణ సంఘు అధ్యక్షుడు, వాడపల్లి

ఈనెల 29 నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు

● జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు



దివాన్‌చెరువు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 29 నుంచి రెండు రోజులపాటు వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తూర్పుగోదావరిజిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గుంటూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాంఫాం ఆడిటోరియంలో వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ వజ్రోత్సవాలకు ముఖ్యఅతిథులుగా గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హాజరవుతారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తలు అందరూ పాల్గొంటారని తెలిపారు. తొలిరోజు వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో అంతర్జాతీయంగా చోటుచేసుకొంటున్న మార్పులు గురించి సదస్సు జరుగుతుందన్నారు. రెండో రోజున 30వ తేదీన అభ్యుదయ రైతులతో వ్యవసాయ వర్సిటీ ద్వారా 60 సంవత్సరాల నుంచి రూపొందించిన కొత్తవంగడాలు, సాంకేతిక పరిజ్ఞానంపై చర్చ జరుగుతుందని తెలిపారు. రైతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చదివిన పూర్వ విద్యార్థులు ఈ అవకాశంను వినియోగించుకోవాలని నరసింహారావు విజ్ఞప్తి చేశారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఓఎన్జీసీ చమురు తరలించుకుపోతోంది

●టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనందసాగర్

కాకినాడసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలోని స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఓఎన్జీసీ పైప్‌లైన్ల ద్వారా చమురు నిక్షేపాలను తరలించుకుపోతోందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్ మండిపడ్డారు. ఈమేరకు శుక్రవారం విడుదలచేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమజిల్లా అమలాపురం నియోజకవర్గం ఓడలరేవు గ్రామంలోని ఓఎన్జీసీ టెర్మినల్ దగ్గర కోనసీమ నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని నిరసన దీక్షలు చేపట్టి కొనసాగిస్తున్నారన్నారు. దీనిపై ఓఎన్జీసీ స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తూ తన అధికారాన్ని, బలాన్ని ఉపయోగించి ఏదోవిధంగా దీక్షా శిబిరాన్ని ఎత్తివేయించాలని ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధమైన ఓఎన్జీసీ వైఖరిని తెలుగు దేశంపార్టీ తీవ్రంగా తప్పుపడుతోందని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని బలంగా డిమాండ్ చేస్తోందన్నారు. కొన్ని దశాబ్దాలుగా కోనసీమ సముద్రతీరంలోని సంపదనంతా ఓఎన్జీసీ తవ్వుకుని ఎత్తుకుపోతోందని, పైప్‌లైన్ల ద్వారా సముద్రగర్భం నుంచి తరలించుపోతోంద న్నారు. కోనసీమ నిరుద్యోగ యువత మంచితనాన్ని చేతకానితనంగా భావిస్తే ఓఎన్జీసీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈసారి ఇక్కడున్న పార్లమెంట్ సభ్యుడికి చమురు సహజ నిక్షేపాల అథారిటీలో డైరెక్టర్ పదవి ఇవ్వకుండా ఎక్కడో బందరులో ఉన్న పార్లమెంట్ సభ్యుడికి ఈ పదవి ఇచ్చారన్నారు. ఆయిల్, గ్యాస్ పట్టుకుపోయేది ఇక్కడి నుంచేనని, స్థానిక పార్లమె ంట్ సభ్యుడికి ఈ కమిటీలో డైరెక్టర్ పదవి ఇవ్వకపోవడం ఎంతో అవమానమన్నారు.

పచ్చని గొడుగులా...

● గోకవరం-రంపయర్రంపాలెం రహదారి

గోకవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడిమి ఎక్కు వగా ఉన్నపుడే చెట్టు విలువ తెలుస్తోంది. కాసేపు ఆ చెట్టు కింద సేదతీరి తిరిగి ప్రయాణం కొనసాగించాలనిపిస్తోంది. గోకవరం-రంపయర్రంపాలెం ప్రధాన రహదారిలో వెళితే ఇదే అనుభూతి కలుగక మానదు. ఆ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చనిచెట్లు ప్రయాణికులకు ఎంతో ఉపసమనాన్ని కల్గిస్తున్నాయి. సాయంత్రం వేళ ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి.



గోకవరం-రంపయర్రంపాలెం రహదారి మధ్యలో పచ్చని చెట్లు

కంచి విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

● రేపు కాకినాడ చల్లా కల్యాణ మండపంలో అవగాహన సదస్సు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కంచిలోని కామకోటి యూనివర్శిటీకి చెందిన చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కంచి పీఠం ప్రతినిధి, వేద పురోహితులు ఆకెళ్ల మురళీకృష్ణశర్మ తెలిపారు. దీని నిమిత్తం యూనివర్శిటీ విశ్వవిద్యాలయ యాజమాన్య, అధ్యా పకులతో ఈనెల 27వ తేదీన కాకినాడ విద్యుత్‌నగర్‌లో ఉన్న చల్లా కల్యాణ మండపంలో ఉదయం 10నుంచి 5గంటల వరకు అవగాహన సదస్సులో చేరేందుకు ప్రవేశాల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. శుక్రవారం చల్లా కల్యాణమండపంలో ఆకెళ్ల మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ధర్మం ఎలా ఉండాలో జీవితంలో ఎలా ఉన్నతస్థితికి చేరాలనేది, క్రమశిక్షణకు సంబంధించి విద్యను నేర్పుతారన్నారు. ఇంజనీరింగ్ విద్యతోపాటుగా ఇంకా ఎంసీఏ, ఎంబీఏ, ఎంటెక్ వంటి విద్యను బోధిస్తారన్నారు. విద్యార్థులకు ఉపకరణాలు హాస్టల్ వంటి సదుపాయాలు ఈ కంచి పీఠం ఆధ్వర్యంలో జరిగే ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల్లో విద్యను అభ్యసించడం ద్వారా ధర్మం, మంచి అలవాట్లు కలుగుతాయన్నారు. తద్వారా వారు ఉన్నత స్థితికి చేరి ఉద్యోగంలో రాణించవచ్చని చెప్పారు. తిరుపతిలో కంచి పీఠం ఆధ్వర్యంలో పాఠశాలలో బ్రాహ్మ ణ బాలికలకు ఉచిత విద్యనందిస్తున్నట్లు తెలిపారు. కంచి ఆధ్వర్యంలో సీబీఎస్ సిలబస్ చెన్నై, పొదిలి ఇంకా తెలంగాణ వంటి ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో విద్యను బోధిస్తున్నట్లు మురళీకృష్ణ చెప్పారు. కంచి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు చేరి తమ ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకెళ్ల మురళీకృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సంఘం నాయకులు చల్లా నిరంజన్ శ్రీనివాస్, దేవత పుత్రరావు, ఎస్.శ్రీరామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేద పురోహితులు ఆకెళ్ల మురళీకృష్ణశర్మ

రండి కలిసి పనిచేద్దాం

- వర్మ చేయి పట్టుకుని తీసుకుని వెళ్లిన డిప్యూటీ సీఎం పవన్
- పిఠాపురంలో ఆసక్తికర సన్నివేశం

పిఠాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా శుక్రవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలువద్ద ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం, వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమానికి వచ్చిన పవన్ అక్కడేఉన్న వర్మనుచూసి ఆగి చేయిపట్టుకుని లోపలకు తీసుకువెళ్లారు.శిక్షణ ప్రారంభానికి సూచికగా రిబ్బన్‌కట్‌చేసే సమయంలో ఎంపీ ఉదయశ్రీనివాస్‌తోపాటువర్మను రిబ్బన్ పట్టుకోవాలని సూచించారు. నియోజకవర్గాభివృద్ధికి ఎంపీ ఉదయ్, వర్మ, జనసేన నేతలు కలిసి పనిచేస్తామని పవన్ ప్రకటించారు.



పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ చేయి పట్టుకుని తీసుకుని వెళ్తున్న పవన్‌కల్యాణ్

టెన్త్, సివిల్స్ టాపర్లకు పవన్ అభినందన



టెన్త్ టాపర్‌గా నిలిచిన నేహాంజని, జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని తోట పుష్పాంజలిలను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం



సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించిన చక్కా స్నేహిత్‌ను అభినందిస్తున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 600కి 600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రికార్డు సృష్టించిన కాకినాడకు చెందిన యాళ్ల నేహాంజనిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభినందించారు. పిఠాపురం పర్యటనలోఉన్న పవన్‌ను ఆమె కలిసింది. గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని తోట పుష్పాంజలి టెన్త్ పరీక్షల్లో 594 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో కాకినాడ జిల్లాలో రెండో ర్యాంకులో నిలిచారు. పుష్పాంజలిని పవన్ అభినందించారు. ఇద్దరు భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించిన పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్‌ను పవన్‌కల్యాణ్ అభినందించారు. పిఠాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలువద్ద పవన్‌ను అతడు కలిశారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించడం ముదాహమన్నారు.

నా కుమార్తెను కాపాడరూ

- డిప్యూటీ సీఎంను కలిసేందుకు వచ్చిన దంపతులు



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుమార్తెను ఆదుకోవాలని కోరుతున్న దంపతులు

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం చొరవ తీసుకుని తమ కుమార్తెను కాపాడాలని ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సూర్య దంపతులు కోరారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుమార్తెను తీసుకుని వారు పిఠాపురం వచ్చారు. పవన్ కలిసే అవకాశం లభించకపోవడంతో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

ఇన్సెంటివ్ బకాయిలు విడుదల చేయరూ

పట్టురైతులకు ఐదేళ్లనుంచి రావాల్సిన రూ.3కోట్ల ఇన్సెంటివ్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని పట్టు రైతులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరారు. పట్టు రైతులకు గతంలో అమలులో ఉన్న రాయితీలు అన్నింటినీ పునరుద్ధరించాలని, రవాణా చార్జీలను చెల్లించాలని, దళారులవల్ల మోసపోయి న రైతులకు రూ.34లక్షల సొమ్ము ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

రెల్లి కులస్తులకు న్యాయం చేయాలి

ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి, ఉపకులాలకు కేవలం 1శాతం రిజర్వేషన్ కేటాయించడం అన్యాయమని రెల్లికులరిజర్వేషన్ సాధన సమితి ప్రతినిధులు అన్నారు. కనీసం 2 నుంచి 3శాతం రిజర్వేషన్‌ను ప్రత్యేకంగా రెల్లి కులానికి కేటాయించాలని, రెల్లి కులస్తుల అభి వృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

రచ్చబండ రద్దు

- వినతుల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొనాల్సిన రచ్చబండ కార్యక్రమం రద్దయింది. దీంతో వివిధ సమస్యలపై వినతులు ఇద్దామని వచ్చిన ప్రజలు నిరాశకు గురయ్యారు. వారినుంచి వినతలు స్వీకరించేందుకుగాను పిఠాపురం ప్రభుత్వాసుపత్రివద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. వారి నుంచి వినతులు తీసుకుని రశీదులు ఇచ్చారు.



వినతుల స్వీకరణకు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్కడి భాస్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించతలపెట్టిన కల్యాణ మండపం శంకుస్థాపన ఆహ్వానపత్రికలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆవిష్కరించారు.



కల్యాణమండపం శంకుస్థాపన ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

రేపు తిరుమలలో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో తిరుమల విద్యాసంస్థల్లో ఆదివారం 6,7,8,9,10 తరగతుల్లోకి రాబోయే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తిరుమల క్యాంపస్‌లో ఈనెల 27న ఉదయం 10నుంచి సదస్సు జరుగుతుందని, తమ పిల్లల భవిష్యత్‌లో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే స్కూల్‌స్థాయి నుంచే ఎలా సంసిద్ధమవ్వాలో ఈ సదస్సులో వివరిస్తారని తెలిపారు. సమాచారంకోసం 7997071672, 8309076048ను సంప్రదించాలని కోరారు.

రెండోరోజు కొనసాగిన ఉపాధ్యాయుల ధ్రువపత్రాల జారీ

కాకినాడక్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో భాగంగా శుక్రవారం రెండోరోజు ఉపాధ్యాయులకు కాకినాడ జీజీహెచ్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు జీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్, గుండె, కంటి, న్యూరో, ఆర్థో, మానసిక వైద్య విభాగాలకు చెందిన వైద్యుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులుకు వైద్య ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంవో డాక్టర్ లావణ్య, సీఎస్ఆర్ఎంవో రాజకుమారిలు పాల్గొన్నారు.

వెటర్నరీ డాక్టర్లు... మూగజీవాల దైవాలు!

కాకినాడ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలైన పశు, జంతు సంరక్షణలో పశు వైద్యుల (వెటర్నరీ డాక్టర్ల) పాత్ర కీలకం. ఈ ఏడాది ఏప్రిల్ నెల నాల్గో శనివారం పశు వైద్య దినోత్సవం. ఈ రోజున పశు, జంతువుల ఆరోగ్యం, సంరక్షణ ముఖ్యంగా జంతు హింసను నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. పెంపుడు జంతువుల సంరక్షణకు సంబంధించిన అనేక అంశాలపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పిస్తారు.

ఎప్పుడు ప్రారంభం..

1863వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా యూరోపియన్ వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జాన్‌జామ్‌జీ వెటర్నరీ కాలేజీలో ఈ వరల్డ్ వెటర్నరీ డేను నిర్వహించారు. అనంతరం 1959లో మాడ్రిడ్‌లో వరల్డ్ వెటర్నరీ అసోసియేషన్ స్థాపించారు. ప్రస్తుతం 70 కంటే ఎక్కువ

నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం

ప్రపంచ దేశాలు వెటర్నరీ అసోసియేషన్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అనంతరం 2001 సంవత్సరంలో ప్రపంచ వెటర్నరీ అసోసియేషన్ ఏప్రిల్ నాల్గో శనివారం నాడు ఈ పశు వైద్య దినోత్సవాన్ని జరుపుకునేందుకు నిర్ణయించింది.

ఇదే లక్ష్యం...

ప్రపంచ పశు వైద్య దినోత్సవం లక్ష్యం వెటర్నరీ సైన్సులో యువత ప్రత్యేక శ్రద్ధ వహించి నైపుణ్యతను పెంపొందించుకోవాలి. ముఖ్యంగా ఎవరూ పట్టించుకోని జంతువులకు జీవన పరిస్థితులను కల్పించి వాటి ఎదుగుదలను వెటర్నరీ వైద్యులు మెరుగుపరుస్తున్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై, అలాగే పెంపుడు జంతువులకు రోగనిరోధక శక్తిని ఎలా అందించాలో తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు, ప్రమాదం పాలై గాయపడినప్పుడు వాటికి చికిత్సను అందజేయడంలో పశు వైద్యుని పాత్ర కీలకం. జంతువుల ఆరోగ్యాన్ని కాపాడడంలో పశు వైద్యుల పాత్ర మానవ శ్రేయస్సుపై ప్రభావంచూపుతుంది.

పశు వైద్యుల సేవలు అభినందనీయం



పశువులు, పెంపుడు జంతువులు, పౌల్ట్రీఫారంలలో వచ్చే సీజనల్ వ్యాధులు, అనారోగ్యాలు, ప్రమాదాల పరంగా ఏర్పడే గాయాలకు చికిత్సను అందించడంలో వెటర్నరీ డాక్టర్లు దైవాలతో సమానం. కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఆవులు 76,502 ఉండగా గేదెలు 2,82,273 ఉన్నాయి. అలాగే గొర్రెలు 1,41,229 ఉండగా మేకలు 1,01, 870 ఉన్నాయి. అలాగే పౌల్ట్రీకి సంబంధించి బ్రాయిలర్, ఫారం కోళ్ళు కలిపి 92,48,636 ఉన్నాయి. అలాగే 33,726 పెంపుడు కుక్కలు ఉన్నాయి. వీటన్నింటికి వైద్యచికిత్స సేవలు అందిస్తున్న పశు వైద్యుల సేవలు అభినందనీయం.

డాక్టర్ వెంకటేశ్వరరావు జాయింట్ డైరెక్టర్, పశు సంవర్ధకశాఖ, కాకినాడ

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.26 కోట్లు



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవస్థానం చైర్మన్, ఈవో

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,26,07,501 నగదు, 50.100 గ్రాముల బంగారం, 950 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్‌ఏకు చెందిన 215 డాలర్లు, యూరోలు 140, థాయిలాండ్‌కు చెందిన 140 బాట్‌లతో పాటుగా పలుదేశాల కరెన్సీ లభించాయి. ఈ లెక్కింపును సిబ్బంది చేపట్టగా ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించారు. 28 రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన భక్తులు రోజుకు రూ.4.50 లక్షలు కానుకల రూపంలో సమర్పించారు.

చంపుతామంటూ బెదిరించి దోపిడీ చేసిన నలుగురి అరెస్టు

పరారీలో మరో ఇద్దరు



కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో నిందితులు

కోటనందూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లి స్పైసీ హోటల్ వద్ద ఈనెల 22న తెల్లవారుజామున ఇద్దరు యువకులను చంపుతామంటూ బెదిరించి వారి వద్ద దోచుకొన్న వస్తువులతో పరారైన ఆరుగురు వ్యక్తుల్లో నలుగురుని కోటనందూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన అల్లాది నాగేంద్రసాయి, గాలంకి కిరణ్‌బాబు లంబసింగి విహారయాత్రకు వెళ్లి తిరివస్తుండగా కాకరాపల్లి వద్ద అరుగురు వ్యక్తులు రెండు స్కూటీలపై వచ్చి వారిని బ్యాట్‌తో అడ్డగించి చెంపపై కొట్టారు. వారి వద్ద ఉన్న బజాజ్ పల్సర్ బైక్, 2 మొబైల్ ఫోన్లు, దుస్తుల బ్యాగ్, రూ.1400 నగదు పట్టుకునిపోయారు. దీంతో బాధితులు పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. స్పెషల్ క్లూస్ టీం రంగంలోకి దిగి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల్లో కాకినాడకు చెందిన పట్టెంకామరాజు, గుటూరి సాయి దుర్గాప్రసాద్, సంగు నాగవెంకట భవాని కుమార్, చింతా పవన్‌కళ్యాణ్‌తో పాటు చల్లా నాగ శివమణికంఠ, ఏనుగుపల్లి రాజు ఉన్నారు. వారందరు శుక్రవారం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం గాంధీనగరం- తాండవ జంక్షన్ మధ్య ఫారెస్ట్ టేక్ ప్లాంటేషన్ వద్ద గుమికూడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కోటనందూరు సీఐ జిచెన్నకేశవరావు, ఎస్‌ఐ టి.రామకృష్ణ, సీపీఎస్ ఎస్‌ఐ అంకబాబు ఆధ్వర్యంలో అక్కడకు వెళ్లి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ఏనుగుపల్లిరాజు, చల్లా నాగశివ మణికంఠ పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన నిందితుల నుంచి పల్సర్‌బైక్ సుజుకీస్కూటీ, హోండా ఎక్టివా, నాలుగు మొబైల్‌ఫోన్లు, క్రికెట్ బ్యాట్, రూ.1400 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టుకు తరలించామని, మిగిలిన ఇద్దరిని కూడా త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

అమ్మ, నాన్న ఉండి.. అనాథలే!

- పట్టించుకోని తల్లి
- వదిలివెళ్లిపోయిన తండ్రి
- దీన స్థితిలో చిన్నారులు



చిన్నారులు తేజ కిరణ్, భానుప్రకాష్

రాజానగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తల్లి వివాహేతర సంబంధం కారణంగా పట్టించుకోకోవడం, ఆపై తండ్రి కూడా వదిలివెళ్లిపోవడంతో అందరూ ఉన్న అనాథలుగా కాలం వెళ్లదీస్తున్న చిన్నారుల హృదయ వేదన ఇది. వివరాల్లోకి వెళితే... తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంత మూరులోని చెంచుల కాలనీలో నివాసముంటున్న అన్నెపు ధనలక్ష్మి, జయరామ్ దంపతులకు తేజ కిరణ్(10), భానుప్రకాష్ (8) పిల్లలు ఉన్నారు. వారు రాజమహేంద్రవరంలోని నారాయణ స్కూల్లో 4,2 తరగతులు చదువుతున్నారు. తండ్రి జయరామ్ పెయింటింగ్ వర్కు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య ధనలక్ష్మి కర్రీ పాయింట్‌లో కేటరింగ్ పనులు చేస్తుండేది. ఈ క్రమంలో మండపల్లి ప్రవీణ్ కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి అది వివాహేతర బంధానికి దారితీసింది. ప్రియుడి మోజులో పడిన ధనలక్ష్మి ఇద్దరు పిల్లలను, భర్తను పట్టించుకోవడంలేదు. కూతురి ప్రవర్తన తీరును మందలించాల్సిన తల్లి తులసమ్మ.. అల్లుడు జయరామ్ బయటకు వెళ్లిపోయేలా చేసింది. ఏడాదిగా తల్లి వద్దనే ఉంటున్న చిన్నారులిద్దరితో ప్రియుడికి అవసరమైన సేవలు చేయించేది. తల్లి చెప్పిన పనులు చేయకపోతే ప్రియుడు ప్రవీణ్‌కుమార్ చిన్నారులను బెల్టు, వైర్లతో శరీరంపై తట్టులు వచ్చేలా కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో విషయం తెలుసుకున్న చిన్నారుల మేనమామ పాలవలస బాలమణికంఠ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసి రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రిలో చిన్నారులకు చికిత్స చేయించి, తన ఇంటికి తీసుకెళ్లాడు. 3 నెలలుగా మేనమామ సంరక్షణలో ఉంటున్న చిన్నారులిద్దరూ తమను నాన్న వద్దకు చేర్పించాలంటూ దీనంగా మేనమామను వేడుకుంటున్నారు. దీంతో మేనమామ బాలమణికంఠ చిన్నారులను వెంటబెట్టుకుని 3నెలలుగా రాజానగరం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కడం దిగడం చేస్తున్నాడు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ నారాయణమ్మను శుక్రవారం ఫోన్‌లో సంప్రదించగా చిన్నారుల తండ్రి శ్రీకాకుళంలో ఉంటున్నాడు. ఒకటి, 2రోజుల్లో వస్తానన్నాడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులు ఎవరి వద్ద ఉంటామంటారో విన్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆమె బదులిచ్చారు.

కేశనకుర్రు టూ వైట్‌హౌస్

సీఐఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్‌గా కోనసీమ వాసి



ఐ.పోలవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అమెరికా సైబర్ సెక్యూరిటీ, మౌలిక సదుపాయాల భద్రతా సంస్థ (సీఐఎస్‌ఏ) డిప్యూటీ డైరెక్టర్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనకుర్రుకు చెందిన డాక్టర్ గొట్టుముక్కల మధు నియమితులయ్యారు. గొట్టుముక్కల వెంకటసూర్యనారాయణ రాజు(కొండరాజు), సత్యవాణి దంపతుల కుమారుడు మధుకు ఈ అరుదైన గౌరవం లభించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగ్రరాజ్యంలో మధు కీలక పదవిని సాధించడంపై తల్లిదండ్రులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గోకవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోకవరం గ్రామ శివారున నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై శుక్రవారం దాడి చేసినట్టు ఎస్‌ఐ వీఎన్‌వీ పవన్‌కుమార్ తెలిపారు. ఈదాడిలో నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలను, ముగ్గురు విటులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చనున్నామని తెలిపారు.

రామాలయంలో ఉత్సవ విగ్రహాల చోరీ

ఉప్పాడ నాయకర్ కాలనీ-1లో ఆలస్యంగా వెలుగులోకి ఘటన



ఆలయంలో చోరీకి గురవకుండా ఉన్న తోరణం

కొత్తపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీ-1లో శ్రీసీతారామస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఉత్సవ విగ్రహాలు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయంలో నిత్యం పూజలు చేసే మల్లే మంగ తెలిపిన వివరాల ప్రకారం. నాయకర్ కాలనీలో పురాతన శ్రీసీతారామస్వామి ఆలయాన్ని పునఃనిర్మించి ఏప్రిల్ 15న విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. కాలనీలో ప్రతీరోజూ ఆలయంలో పూజలు చేస్తారు. నాలుగురోజుల కిందట ఆలయంలో పూజలు చేసుచేసేందుకు స్థానికుడు ఒకరు ఆలయం తాళం అడిగారు. పూజల అనంతరం ఆలయానికి వేసిన తాళాన్ని దగ్గర్లో ఉన్న బడ్డీకొట్టులో ఇచ్చి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయంలో స్థానిక సమస్యలపై పెద్దలు చర్చిస్తుండగా ఆలయంలో ఉత్సవ విగ్రహాలు లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే ఆలయం తలుపులు తీసి పరిశీలించేసరికి తోరణం, హనుమాన్ విగ్రహం తప్ప మిగిలిన ఉత్సవ విగ్రహాలను అపహరించడాన్ని గుర్తించారు. ఆలయం లో చోరీకి గురైన కంచు ఉత్సవ విగ్రహాల విషయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి గురైన ఉత్సవ విగ్రహాలు సుమారు రూ.50వేలపైగానే ఉంటాయని స్థానిక మత్స్యకారు పెద్దలు చెబుతున్నారు.



చోరీకి గురైన ఉత్సవ విగ్రహాలు (ఫైల్‌ఫొటో)

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన



మండపేటలో సత్తిబాబు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

మండపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పని ముగించుకుని ఓ వ్యక్తి ఇంటికి వెళ్తున్న సమయంలో బైక్ వేగంగా ఢీకొనడంతో మృతిచెందాడు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట గొల్ల పుంత కాలనీకిచెందిన మాదాబత్తుల సత్తిబాబు స్థానికంగా వెండి పట్టీల తయారీ దుకాణంలో పని చేస్తుంటాడు. గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఓ బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన సత్తిబాబును మండపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్తిబాబు శుక్రవారం మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతడికి భార్య, పిల్లలు వున్నారు. కుటుంసభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు సహచర కార్మికులు, బంగారు దుకాణ వ్యాపారులు సత్తిబాబు మృతదేహంతో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కలువపువ్వు సెంటర్‌లో ఆందోళనకు దిగారు. మానవహారం చేపట్టారు. పట్టణ సీఐ దారం సురేష్ అక్కడకు చేరుకుని ఆందోళ కారులతో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ప్రమాదానికి కారకుడైన వ్యక్తి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని కోలుకున్న వెంటనే అదుపులోకి తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి



మరణించిన వ్యక్తి

తుని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. హంసవరం నుంచి అన్నవరం మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా ఓ రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందినట్టు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే మృతుడికి సంబంధించిన వివరాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు రైల్వే ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని కోరారు. మృతదేహం వద్ద నీలి రంగు బ్యాగ్ లభించిందని, తెలుపు చొక్క, ఫుల్ ప్యాంట్ దుస్తులు ధరించి ఉన్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో అన్నవరం దేవస్థానం ఉద్యోగి మృతి



తలుపులయ్య (ఫైల్)

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి తలుపులయ్య (58) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ప్రస్తుతం ప్రోటోకాల్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు డయాబెటీస్ ఉండడంతో కొంతకాలంగా నీరసంగా ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తలుపులయ్య మృతి పట్ల దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంటా విష్ణు, బలువు సత్యశ్రీనివాస్ సంతాపం తెలిపి నివాళులర్పించారు.

కోడిపందాలాడుతున్న 26 మంది అరెస్టు

రూ.96,700 నగదు, 25 సెల్‌ఫోన్లు, 20 బైక్‌లు, 3 కారులు, 3 కోళ్లు స్వాధీనం



కోరుకొండ మండలం మధురపూడిలో పట్టుబడ్డ 26 మందితో పోలీసులు

కోరుకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ పోలీసులు కోడిపందాల శిబిరంపై మెరుపు దాడి చేశారు. తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు కోరుకొండ మండలం మధురపూడి గ్రామ శివారులో కోడిపందాలాడుతున్న వారిపై గురువారం అర్ధరాత్రి కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ టి.శ్యామ్‌సుందర్, సిబ్బందితో దాడి చేశారు. 26 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.96,700 నగదు, 25 సెల్‌ఫోన్లు, 20 బైక్‌లు, 3 కారులు, 3 కోళ్ల స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకం

సచ్చిదానంత సరస్వతి మహాస్వామిజీ



మీడియాతో మాట్లాడుతున్న స్వామిజీ

తుని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకమని తపోవన ఆశ్రమం పీఠాధిపతి సచ్చిదానంత సరస్వతి మహాస్వామిజీ అన్నారు. కాకినాడ జిల్లా తుని మండలంలో గల ఆశ్రమంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఉగ్రదాడి దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రకృతి అందాలను చూసేందుకు వచ్చిన పర్యాటకులపై కాల్పులు జరిపి హతమార్చడం హేయమైన చర్యగా అభివర్ణించారు. హిందువులని తెలుసుకుని చంపడం ఘోరాతి ఘోరమైన అంశమన్నారు. ఇటువంటి చర్యలను అందరూ ఖండించాలని కోరారు. ఉగ్రవాదం భావజాలంతో ఉన్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాజంలో శాంతి, సామరస్యమే ఉన్నతమైన వాతావరణాన్ని తీసుకువస్తుందని కానీ ఇలాంటి హింసాత్మక సంఘటనలు ఎటువంటి ప్రభావాన్ని చూపించవని అన్నారు. కేవలం మత పరమైన భావజాలంతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం దారుణమైన విషయమని స్వామిజీ చెప్పారు. భారతదేశం మతాలు, వర్గాలకతీతంగా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉగ్రవాదం అందరికీ ఉమ్మడి శత్రువు అని కేంద్ర నాయకత్వానికి భారతీయుల సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నాదానికి వ్యతిరేకంగా గళంవిప్పేందుకు భారతీయులు ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం



మాచవరం ప్రధాన కాలువలో మృతదేహం

రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట-మాచవరం ప్రధాన కాలువలో మొయిన్‌రోడ్డు ఆనుకుని ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. నిక్కర్, బనియన్‌తో సుమారు 50 ఏళ్ల కలిగిన పురుషుడి మృతదేహం కాలువలో బాగా ఉబ్బి ఉండటంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. ఈ విషయాన్ని స్థానికులు 100 సమాచారం తెలియజేయడంతో రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఏలేరు కాలువలో...



రౌతులపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామ శివారు బంగారయ్యపేట వంతెన వద్ద ఏలేరు కాలువలో 60ఏళ్ల వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చిందని ఎస్‌ఐ జి. వెంకటేశ్వరరావు తెలిపారు. తెలుపు రంగు మీద నలుపు చారలు హాఫ్ హ్యాండ్స్ గళ్ల చొక్కా వైట్ బనియన్ వేసుకుని ఉన్నాడని, ఎత్తు 5.5 అడుగులు ఎత్తు, తెలుపు రంగు జుట్టు, తెలుపు గెడ్డం ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు రౌతులపూడి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

చెరువులో మోటారుసైకిల్ పడి వ్యక్తి మృతి

అల్లవరం ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సామంతకుర్రు పల్లిపాలేనికి చెందిన పెసింగి కామరాజు(65) మోటారుసైకిల్‌పై వెళ్తూ రోడ్డుపక్కన చెరువులో పడి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. భార్య అన్నపూర్ణను ఉపాధి పనుల నుంచి తీసుకువచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయాడు. చెరువులో అతడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అల్లవరం ఎస్‌ఐ టి.తిరుమలరావు తెలిపారు.

పంటకాలువలో జారి పడి వ్యక్తి గల్లంతు?

అమలాపురం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నడిపూడి లాకుల వద్ద ప్రధాన పంటకాలువలో శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి జారిపడి గల్లంతైనట్టు సమాచారం అందుకున్న అమలాపురం తాలూకా పోలీసులు హుటాహుటీన అగ్నిమాపక సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి 9 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టినా గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదని తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన సరెళ్ల సురేష్‌కుమార్ ముంగండ గ్రామంలో జరిగిన వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. అంతకు ముందు మధ్యాహ్న సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌కుమార్‌ను స్థానికులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి సురేష్‌కుమార్ లేకపోవడంతో ప్రధాన పంటకాల్వలో జారి పడి గల్లంతైనట్టు భావిస్తున్నారు. గజ ఈతగాళ్లతోను గాలింపు చర్యలు చేపట్టారు. అయితే సురేష్‌కుమార్ గల్లంతయ్యాడా లేక ఎటువైపైనా వెళ్లిపోయాడా అన్న కోణంలోను పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.



మంచు.. మైమరపించు

శుక్రవారం సూర్యోదయం వేళ తూర్పుగోదావరి జిల్లా తీపర్రు వద్ద గోదావరి లంక ప్రాంతాల్లో మంచు దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా..

పెరవలి(ఆంధ్రజ్యోతి)

విద్యుత్ వైర్లపై పడ్డ కొబ్బరిచెట్టు

అంతర్వేది, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సఖినేటి పల్లి మండలం మూడు తూముల వద్ద నుంచి అంతర్వేది సబ్‌స్టేషన్‌కు వస్తున్న ప్రధాన విద్యుత్ వైర్లపై శుక్రవారం తెల్లవారుజామున 4గంటలకు కొబ్బరిచెట్టు పడింది. విద్యుత్‌అధికారులు షెడ్డును తొలగించి సరఫరాను పునరుద్ధరించారు ఏ ప్రమాదం జరగలేదని ఈఈ బి.ప్రసాద్ తెలిపారు.

మలేరియా నివారణ దినోత్సవ ర్యాలీ

అంబాజీపేట, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): జాతీయ మలేరియా నివారణ దినోత్సవ ర్యాలీ స్థానిక పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అప్పారావు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషిచేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర



ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో చేపట్టిన ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌వో

అమలాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర ప్రజలకు పిలుపునిచ్చారు. అమలాపురంలోని ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ మలేరియా నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మలేరియా నిర్మూలనకు అమలు చేస్తున్న వినూత్న ప్రణాళికలను సమష్టి కృషితో చేపట్టాలని పిలుపునిచ్చారు. మలేరియాపై అవగాహన పెంచడానికి వ్యాధిని నియంత్రించడానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈసందర్భంగా దుర్గారావు దొర ఆధ్వర్యంలో ర్యాలీని ప్రారంభించారు. వైద్యాధికారులు ఎంఎం మణిదీప్, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎన్వీ రామారావు, ఎన్.రాజబాబు, సూపర్‌వైజర్ సత్యనారాయణ, హెల్త్ విజిటర్ ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు అరికట్టవచ్చు

దోమల నివారణతో ఎన్నో రకాల జ్వరాలు, వ్యాధులను అరికట్టవచ్చునని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కీటక జనిత వ్యాధులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తొలుత ఆయన సందర్శించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.వాసునాయక్‌తో కలిసి మెడికల్ ల్యాబ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయం-2 పరిధిలో జరుగుతున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో వెంకటేశ్వరరావు పాల్గొని స్థానికులకు కరపత్రాలు పంచుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి.రాజబాబు, ఎన్వీ రామారావు, డి.ఆనందశేఖర్, ఉప్పుగంటి నాగబసవరాజు, డీఎస్ఎస్ ప్రసాద్, వి.శ్రీహరి, ఎస్ఎన్ శ్రీవిద్య, జె.మణిరత్నకుమారి, జి.ఆశాలత పాల్గొన్నారు.

అందరూ కృషి చేయాలి

మామిడికుదురు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.స్వర్ణలత సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరం పీహెచ్‌సీలో అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. దోమల నిర్మూలనతోనే మలేరియా వ్యాధి నివారణ జరుగుతుందన్నారు. మలేరియా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్యవతి, పీహెచ్ఎన్ విజయకుమారి, సూపర్‌వైజర్లు బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

అంతర్వేది, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జనావాసాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని డాక్టర్ సీహెచ్ దుర్గాకావ్య సూచించారు. కార్యక్రమంలో ఎస్వీవీఎస్ మూర్తి, పీఎల్ఎన్ స్వామి, డి.లలితకుమారి, కె.శ్రీనివాస్, ఎ.సరస్వతి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే..

ఐ.పోలవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కేశనకుర్రు ఆరోగ్యకేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యాధికారి రాజేష్‌బాబు పర్యవేక్షణలో గ్రామంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి పి.రాజ్‌కుమార్, ఎంపీహెచ్‌ఈవో ఎం.వెంకటేశ్వర్లు, కె.రమేష్, ఎం.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో చెత్త తరలింపు ప్రారంభం

- కట్టుదిట్టమైన పోలీస్ భద్రత
- పోలీసుల అదుపులో నలుగురు



యానాంలో చెత్త తరలిస్తున్న దృశ్యం

యానాం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తంగన్ ఆదేశాలతో చెత్త తరలింపు ప్రక్రియ శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. యానాం గోపాల్‌నగర్ సబ్‌స్టేషన్ వెనుక డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలంలో ట్రాక్టర్లతో చెత్తను పారిశుధ్య సిబ్బంది డంప్ చేశారు. శుక్రవారం ఉదయం సబ్‌స్టేషన్ ఎదుట టెంట్‌వేసి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న గోపాల్‌నగర్ డంపింగ్ యార్డు పోరాట సమితి సభ్యులు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, మంతెన సూర్యనారాయణరాజు, శ్రీనివాసులు, రామ్‌కుమార్, ములగపాటి వీవీ ఆంజనేయరాజులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామాల నుంచి ప్రజలు, నాయకులు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ఎందుకు అదుపులోకి తీసుకున్నారని పోలీసు ఉన్నతాధికారులను ప్రజలు నిలదీశారు. అనంతరం జరిగిన చర్చల తర్వాత అదుపులోకి తీసుకున్న నలుగురిని విడిచిపెట్టారు. వేగంగా జరుగుతున్న చెత్త తరలింపును పుదుచ్చేరి కలెక్టర్, ఆర్‌ఏ తదితర శాఖల అధికారులు పర్యవేక్షించారు. యానాం పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేశారు.

గోపాల్‌నగర్‌లో రీసోర్స్ రికవరీ పార్కు

యానాం గోపాల్‌నగర్‌లో రిసోర్స్ రికవరీ పార్కు ఏర్పాటు చేస్తామని, ఇది డంపింగ్ యార్డు కాదని పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తంగన్ అన్నారు. యానాంలో ఉన్న డంపింగ్ యార్డు సమస్యను తాత్కాలికంగా పరిష్కరించేందుకు యానాం వచ్చినట్టు ఆయన తెలిపారు. కనకాలపేట డంపింగ్ యార్డును పరిశీలించామని, చెత్తను గోపాల్‌నగర్‌లోని సబ్‌స్టేషన్ వద్ద ఉన్న రిసోర్సు రికవరీ పార్కులో వేస్తున్నట్టు చెప్పారు. 15రోజుల్లో పూర్తిస్థాయిలో యంత్రాలు వస్తాయని, అనంతరం రిసోర్స్ రికవరీ పార్కు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. విద్యాశాఖ ఆధీనంలో ఉన్న పీఎంశ్రీ రాజీవ్‌గాంధీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. యానాం ప్రభుత్వాసుపత్రిని పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. యానాం సబ్‌జైల్‌ను సందర్శించారు. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ పరిశీలన

రాజోలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తాటిపాక యూనిట్ పరిధిలో గల ఆర్ఎస్కేలో ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు శుక్రవారం పరిశీలించారు. రైతులను ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకుని, అనంతరం పీఎండీఎస్ కిట్లను రైతులకు అందజేశారు. రైతుల పొలాలను ఆయన పరిశీలించారు.

నిరసన ప్రదర్శన

మామిడికుదురు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో కాల్పులకు పాల్పడిన ఉగ్రవాదులను అణచివేయాలంటూ మామిడికుదురులో ముస్లింలు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. ఉగ్రదాడిని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో మామిడికుదురులోని షియా మసీదు నుంచి గ్రామ పురవీధుల్లో నిరసన చేపట్టారు. భారత మాతాకీ జై.. ఉగ్రవాదం నశించాలంటూ త్రివర్ణ పతాకాన్ని ధరించి ప్రదర్శన చేశారు. మామిడికుదురులోని సున్నీ జామియా మసీదు వద్ద నిరసన చేపట్టారు. నగరం, మామిడికుదురు గ్రామాల ముస్లిం పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

సరిపల్లిలో చలివేంద్రం ఏర్పాటు

ఉప్పలగుప్తం, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి):అమలాపురం- చల్లపల్లి ప్రధాన రహదారిలో సరిపల్లి వద్ద సర్పంచ్ గెడ్డం స్వరూపాసురేష్ బాబు ఆధ్వర్యంలో చవటపల్లి శ్రీనివాసరావు(బుల్లిదొర) సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు.శుక్రవారం మాజీ సర్పంచ్ గెడ్డం సురేష్‌బాబు ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామపెద్దలు దేవరపల్లి తాతారావు, గెడ్డం సత్యనారాయణ, పరమట యోహాన్, పొలమూరి వెంకటేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాజోలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తాటిపాకలో సోమిశెట్టి ల్యాండ్‌మార్క్ వద్ద జాతీయ రహదారి 216 వద్ద సోమిశెట్టి ఆంజనేయులు, నాగలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఎంపీపీ కేతా శ్రీను ప్రారంభించారు సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, ఉపసర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, తాటిపాక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అడబాల దొరబాబు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై వెల్లువెత్తిన నిరసనలు

కొవ్వొత్తుల ర్యాలీలు.. మానవహారం





అంతర్వేది దేవస్థానంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు, మలికిపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే దేవ, కూటమి నాయకులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శుక్రవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసనలు హోరెత్తాయి. వివిధ రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాలు, సామాజికవర్గాల వారీగా నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదుల దాడికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి ప్రధాని మోదీ, హోం మంత్రి, రక్షణమంత్రులు తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి డిమాండ్ చేశారు. జనసేన అమలాపురం నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో సంతాప మానవహారం నిర్వహించారు. పార్టీ తరపున మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించామని కల్వకొలను తాతాజీ పేర్కొన్నారు. మానవహారంలో నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, గునిశెట్టి చినబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, ఆర్డీఎస్ ప్రసాద్, చిక్కం సుధ, పరమట చిట్టిబాబు, తిక్కా సరస్వతి, ఆకుల బుజ్జి, చాట్ల మంగతాయారు తదితరులు పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్రకుమార్, ఎన్వీవీ సుబ్బారావుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, జేవీవీ జిల్లాశాఖ బాధ్యులు డాక్టర్ ఇఅర్ సుబ్రహ్మణ్యం, ఖ్వాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొని ఉగ్రవాదం నశించాలి, మత సామరస్యం వర్థిల్లాలంటూ నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం నాయకులు యార్లగడ్డ రవీంద్ర, వంటెద్దు బాబీ, కుడుపూడి శ్రీనివాస్, ఏలేశ్వరపు రాధాకృష్ణ, పోలిశెట్టి హరిబాబు, షకీలా, పేరి శర్మ తదితరులు పాల్గొన్నారు. ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమైక్యత సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతులకు నివాళులర్పించి దేశ సమగ్రతకు, దేశ భద్రతా వ్యవస్థలకు సంఘీభావం తెలిపారు. కొవ్వొత్తుల ర్యాలీలో ఎస్టీయూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్, జిల్లాఅధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యపల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, మండలశాఖల బాధ్యులు పాల్గొన్నారు. బండారులంకలో యువత ఆధ్వర్యంలో స్థానిక వీరభద్రస్వామి గుడి సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బళ్ల స్వామివివేకానంద, చింతపట్ల బాబు తదితరులు పాల్గొన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం పట్టణ పురవీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక మొల్లాముస్తఫా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కశ్మీర్ మృతులకు అశ్రు నివాళి అర్పిస్తూ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మసీదు సెంటర్ నుంచి గడియార స్తంభం సెంటర్, బస్టాండు సెంటర్ మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ పెద్దలు ఎండీ ఆజామ్, ఎండీ అమీర్, ఎంఎంకేజీ మొయినుద్దీన్, షేక్‌అబ్దుల్ ఖాదర్, ఖ్వాజాబాబు, మహ్మద్ వలీ, కేఎల్ మెహబూబ్, జీఎంఖాన్, ఎస్ఏ అలీ, సయ్యద్‌లాల్, షఫీఉల్లా, షెహన్‌షా, మహ్మద్ రజా, అలీముద్దీన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అమలాపురం బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి న్యాయవాదులు కోర్టు ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలు విడనాడాలని నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయిరామ్, ప్రధాన కార్యదర్శి నందిక శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. నిరసనలో అడపా ప్రసాద్, నందెపు చినవెంకటేశ్వరరావు, కన్నీడి వెంకటరమణ, బడుగు భాస్కరజోగేష్, మట్టపర్తి అచ్యుతానంద్, వై.సత్యనారాయణ, కుడుపూడి శ్రీనివాస్, వెంపరాల భాస్కరశాస్త్రి పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ముమ్మిడివరం నసరుల్ మోమెనీన్ జామియా మసీదులో నల్ల రిబ్బన్లతో శుక్రవారం ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఎంఏ గౌస్ బాషా ఆధ్వర్యంలో ముస్లిలంతా ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకుని బహిరంగంగా కాల్చి చంపాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల పట్ల ఎంత కఠినంగా వ్యవహరించినా ముస్లిం సమాజమంతా వెన్నంటి ఉంటుందని వారు వివరించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని బీజేపీ నాయకుడు యాళ్ల దొరబాబు అన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఉగ్రవాద చర్యను పూర్తిగా అణచివేయాలని ఆయన కోరారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం 16 స్తంభాల మండపం వద్ద పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మృతిచెందిన పర్యాటకులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనరసింహ యువత, బీజేపీ మండలాధ్యక్షుడు పోతురాజు సురేష్, ఎంపీటీసీ బైరా నాగరాజు, స్థానిక యువ నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): అమాయకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదులను అణిచివేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పి.గన్నవరం త్రిరోడ్ జంక్షన్‌లో ఉగ్ర వాద దాడులను నిరసిస్తూ మానవహారం నిర్వహించారు. భారత మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. తొలుత స్థానిక జనసేన క్యాంపు కార్యాలయం నుంచి పి.గన్నవరం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, చిట్టూరి శ్రీనివాసరావు, బొంతు పెదబాబు, మద్దా చంటి, చిన్నం బాలవిజయరావు, శేరు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు,(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి అన్నారు. శుక్రవారం రాత్రి తాటిపాక సెంటర్‌లో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాబి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు, అదనపు కార్యదర్శి కాసు శ్రీనివాస్, వాణిజ్య విభాగం చైర్మన్ లక్కింశెట్టి బాబులు, లక్కింశెట్టి నానాజీ, యెండూరి రమేష్ పాల్గొన్నారు. రాజోలు గాంధీబొమ్మ సెంటర్‌లో రాజోలు చాంబర్ ఆఫ్ కామర్స్, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కార్గిల్ అమరవీరుల స్థూపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. రాజోలు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీను, కాట్నరాజు, సత్తిరాజుస్వామి, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, రాజానాగరత్నకుమార్, కొత్త పద్మావతి, కాసు రాణి, సుధ, డాక్టర్ ఏవీ నరసింహరాజు, ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్యని అంబాజీపేట ఇందాదుల్ ముస్లిమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీరఫీ అన్నారు. అంబాజీపేట మసీదులో జుమ్మా నమాజ్ అనంతరం ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ జాతీయ పతాకంతో ముస్లింలు నిరసన తెలిపారు. ఉగ్రవాదదాడిలో మృతులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఆరీఫ్, ఇస్మాయిల్, సూరాజ్, వలీ, అజాద్, కరీముల్లా, అహ్మద్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై దాడి చేసిన ప్రతీ ఒక్కరికీ తగిన గుణపాఠం చెప్పాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం సెంటర్‌లో కూటమి ఆధ్వర్యంలో భారీ ఎత్తున మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. జెండాతో ఎమ్మెల్యే భారతమాతకు జై నినాదాలు చేశారు. మలికిపురం సెంటర్ నుంచి కళాశాల వరకు ర్యాలీగా ప్లకార్డులతో వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ముప్పర్తి నాని, గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, దిరిశాల బాలాజీ మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, మాలే శ్రీనివాసనగేష్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు తమ జెండాలతో ముందుగా పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న పాకిస్తాన్‌కు గట్టిగా సమాధానం చెప్పాలన్నారు. పహల్గాంలో పర్యాటకులను కిరాతకంగా కాల్చి చంపిన ఉగ్రవాదులను శిక్షించాలని డిమాండ్‌చేస్తూ సామాజిక హక్కుల వేదిక, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో దేవ రాజేంద్రప్రసాద్, నల్లి బుజ్జిబాబు, ఎన్డీ అబ్దుల్‌రహీం, జియాఉద్దీన్, కొండా సత్తిబాబు పాల్గొన్నారు.

సరస్వతీ నదీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు



అమలాపురం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ నదీ పుష్కరాలు పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజారవాణాధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ తెలిపారు. మే 15 నుంచి 25వరకు కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలు జరగనున్నాయి. జిల్లాలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. పుష్కర యాత్ర ప్యాకేజీలో భాగంగా వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాలతో పాటు ప్రధానంగా సరస్వతీ నదిలో పుష్కర స్నానం చేసే ఏర్పాట్లు ఉన్నాయన్నారు. అమలాపురం డిపో నుంచి ఇంద్ర ఏసీ సర్వీసు కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బస్సులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. ముందస్తుగా రిజర్వేషన్ల కోసం సెల్ 9959225576, 9959225550, అసిస్టెంట్ మేనేజర్ సెల్ 7013868687ను సంప్రదించాలన్నారు. సరస్వతీ నదీ పుష్కరాల కోసం ఏర్పాటుచేసిన సూపర్‌లగ్జరీ బస్ టిక్కెట్ ధర ఒక్కొక్కరికీ రూ.2200, ఇంద్ర ఏసీ బస్ టిక్కెట్ చార్జి రూ.2700గా మూడు రోజులు వెళ్లి రావడానికి నిర్ణయించామని రాఘవకుమార్ తెలిపారు. బస్సు సామర్థ్యానికి సరిపడా ప్రయాణికులు వస్తే వారి గ్రామం నుంచే నేరుగా బస్సు బయలుదేరేలా ఏర్పాటు చేశామని అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌పై విద్యార్థులకు అవగాహన

అమలాపురం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పేరూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ బూట్ క్యాంప్ ట్రైనింగ్ శుక్రవారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కేఏఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఇంట్రడక్షన్ ఆఫ్ పిక్టోబాక్స్, ఇమేజ్ క్రియేషన్ పిక్టోబాక్స్, యానిమేషన్, కన్వర్షేషన్ బిట్వీన్ టూ స్ప్రైట్స్, వాయిస్‌యాడింగ్ టూ కన్వర్షేషన్, యాపిల్ క్యాచింగ్ గేమ్ డిజైనింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు శిక్షణను పర్యవేక్షించారు. అటల్ హబ్ స్కూల్ రిసోర్స్ పర్సన్స్ కె.పద్మావతి, కె.పావని, గౌరీప్రసాద్, అటల్ స్కూల్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినూత్నంగా కూరగాయల అందజేత



పి.గన్నవరం, ఏప్రిల్ 25(ఆంధ్ర జ్యోతి): రాజకీయ నాయకులకు బొకేలకు బదులు పుస్తకాలు, నిత్యావసరాలు అందించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో పోతవరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు, స్థానిక నాయకులకు శుక్రవారం స్థానిక నాయకుడు దైవాల రాంబాబు కూరగాయలు అందించారు. కూరగాయలను పేదలకు అందించేందుకు ప్యాకెట్లు తయారు చేసిననట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఆనందరావు మాస్టారును ఆదర్శంగా తీసుకోవాలి

ఎమ్మెల్యేలు ఆనందరావు, సత్యనారాయణల ఆధ్వర్యంలో సన్మానం



ఆనందరావు మాస్టారు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు అయితాబత్తుల, గిడ్డి తదితరులు

అమలాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నేటితరం ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కత్తుల ఆనందరావు వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కత్తుల ఆనందరావు ఉద్యోగ విరమణ సందర్భంగా అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, డీఈవో సలీంబాషా, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పి.గన్నవరం మండలం ఎస్టీ యూపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో వక్తలు ఆనందరావు సేవలను ప్రశంసించారు. కార్యక్రమానికి ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు నల్లా బాలాజీ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యేలు అతిథులుగా పాల్గొని ఆనందరావు దంపతులను దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో డీఈవో సలీంబాషా, సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, డీసీసీబీ సెక్రటరీ బీర హనుమంతరావు, పి.గన్నవరం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎస్టీయూ నేతలు ఎస్ఎస్ పల్లంరాజు, నేరేడుమిల్లి సత్యనారాయణ, నాగిరెడ్డి శివప్రసాద్, చొప్పల రాంబాబు తదితరులు పాల్గొని ఆనందరావు దంపతులను ఘనంగా సన్మానించారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సత్కారం

ముమ్మిడివరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మరిన్ని విజయాలు సాధించి ఉన్నతస్థాయికి చేరుకుని జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మండలస్థాయిల్లో 582 మార్కులతో ప్రథమస్థానం సాధించిన ఎ.అనూష, 578 మార్కులతో ద్వితీయస్థానం సాధించిన పీహెచ్ఎన్ సందీప్, 576 మార్కులతో తృతీయ స్థానం సాధించిన ఎన్వీ రవీంద్రను శుక్రవారం ముమ్మిడివరం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖాధికారులు జి.గౌరీశంకర్, ఆర్.ఉదయభాస్కరరావుల అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో డీఈవో సలీంబాషా మాట్లాడారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను దుశ్శాలువాలతో సత్కరించారు. పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా రెండో స్థానం సాధించడం పట్ల మండల విద్యాశాఖా తరఫున డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషాను సత్కరించారు. ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్‌పరిమళ, జి.ఉదయభాస్కర్, టీవీ కృష్ణారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

లక్ష్యం దిశగా పయనించాలి



మామిడికుదురు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యం ఏర్పాటు చేసుకుని దానిని సాధించే దిశగా పయనించాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు కోరారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థులను నామన కలుసుకుని వారిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. 582మార్కులు సాధించిన మామిడికుదురుకు చెందిన నయినాల లితీష్‌వర్ధన్‌తో పాటు మగటపల్లి గ్రామానికి చెందిన దొడ్డా కుమార్‌మణికంఠ, బొంతు దుర్గాసాయిశ్రీ, షేక్ హబీబ్‌సానియాలను సన్మానించి అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు ఈలి శ్రీనివాస్, సాపే ఏకాదశి, కాండ్రేగుల వెంకటరెడ్డి, చెల్లింగి సింహాచలం, నయినాల కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో మెలగాలి

పి.గన్నవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):సమాజంలో ప్రతీ ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపు నిచ్చారు. పోతవరం ప్రధానరహదారి వద్ద జనసైనికుడు దైవాల రాంబాబు ఆధ్వర్యంలో దైవాల పుల్లయ్యజ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు వడలి కొండయ్య, బొండాడ నాగమణి, మట్టపర్తి రామకృష్ణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, పప్పుల సాయిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, కుంపట్ల నాయుడు, శేరు శ్రీనుబాబు, అన్నాబత్తుల హనుమాన్, మట్టపర్తి మణికంఠ పాల్గొన్నారు.

పోతవరం రోడ్డు నాణ్యత పరిశీలన

పి.గన్నవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పోతవరం వద్ద కుంగిపోయిన 360 మీటర్ల రహదారిని నూతన పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నారు. ఆర్ అండ్‌బీ ఈఈ బి.రాము, డీఈ రాజేంద్ర ఆధ్వర్యంలో కృష్ణ జిల్లా గన్నవరానికి చెందిన అన్నూర్ ల్యాబ్ సిబ్బంది శుక్రవారం లోడ్ పరీక్ష చేశారు. ఈఈ రాము జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఏఈ కె.మణికుమార్, కాంట్రాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, పలువురు అర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

25శాతం సీట్లు కేటాయింపు

అంతర్వేది, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీటు పేద విద్యార్థులకు కేటాయిస్తామని మండల విద్యాశాఖాధికారి-1 బి.కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాల్లో ఐబీ, ఐపీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. ప్రతికూలత గ్రూపులైన అనాథలైన, హెచ్ఐవీ ఎఫెక్టెడ్, దివ్యాంగుల వారికి 5శాతం, ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీలు, మైనార్టీలు, ఇతరులకు 6శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. అర్హులైన వారు దరఖాస్తులను గ్రామ సచివాలయం, నెట్‌సెంటర్లు, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో దీనికి సంబంధించి హెల్ప్ డెస్క్ ఉందని, వివరాలకు 9948736606, 98669947771లను సంప్రదించాలని ఎంఈవో కిశోర్ కుమార్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రజారోగ్యం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ సాగులో పండించిన పంట ఉత్పత్తులతోనే ప్రజారోగ్యం సాధ్యమవుతుందని సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు పేర్కొన్నారు. అమలాపురం డివిజన్ నల్లమిల్లి యూనిట్ తరపున శుక్రవారం గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ మాట్లాడారు. నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఎం.సూరిబాబు మాట్లాడుతూ ప్రస్తుత పంట భూమి ఖాళీ సమయంలో 31రకాల విత్తనాలను కలయ దున్నడంతో సాగుభూమి సారవంతంగా మారుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అప్పారి వెంకటరమణ,జి.దుర్గాభవానీ, ఎం.సుగుణ, వి.సురేష్, ఎ.కృష్ణప్రశాంతి, సుశీల, మాధుని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

ముమ్మిడివరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినులను శుక్రవారం సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమణీకుమారి ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన పాల షణ్ముకప్రియ 574 మార్కులు, ద్వితీయ స్థానంలో మమత, తృతీయ స్థానంలో బీర సోనీలు నిలిచారు. ఆ ముగ్గురిని పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం

అంతర్వేది, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని శుక్రవారం స్వామి వారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు స్వామి-అమ్మవార్లను పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి ప్రత్యేక అలంకరణ చేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మాంగళ్యధారణ, అర్చకులు స్వామి-అమ్మవార్ల కల్యాణతంతు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనగా గోవింద నామస్మరణల మధ్య శాంతి కల్యాణం జరిపారు.

61వ రోజు రిలే దీక్షలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోలో 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయడంతో పాటు డ్రైవర్ బీఎస్ నారాయణకు అమలాపురం డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 61వ రోజుకు చేరుకున్నాయి. డిపో అధ్యక్షుడు ఎండీ ఔలియా ఆధ్వర్యంలో జరిగిన దీక్షల్లో పి.రాంబాబు, ఎస్కే కరీముల్లా, జీవీవీఎస్ నారాయణ, బీఆర్ కృష్ణలు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి పి.మణిరాజు, పందిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మండపేట

విజయదుర్గ పీఠంలో సోము వీర్రాజు పూజలు



విజయదుర్గా పీఠంలో గాడ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు దంపతులు

రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, వరలక్ష్మి దంపతులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహించారు. పీఠం ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి దంపతులు, పెదపాటి రాంపండు, తదితరులు ఎమ్మెల్సీ దంపతులకు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా పీఠంతో తనకున్న అనుబంధాన్ని ఎమ్మెల్సీ సోము గుర్తు చేసుకున్నారు. సోము వీర్రాజు దంపతులను లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి శ్రీదేవిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీదేవిని ఎమ్మెల్సీ ఈసందర్భంగా సత్కరించి అభినందించారు. ఎమ్మెల్సీ వెంట బీజేపీ నాయకులు నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈరెళ్ల కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు క్విజ్ పోటీలు



పరీక్ష రాస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మండపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖలో రోజురోజుకు వస్తున్న మార్పులు నేపథ్యంలో ప్రభుత్వం ఆ శాఖ ఉద్యోగులు మెదడుకు పదునుపెట్టనుంది. అందుకోసం మండల స్థాయిలో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి శుక్రవారం సామర్థ్య పరీక్షలు నిర్వహిం చింది. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ తేజేశ్వరరావు సారథ్యంలో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు. మండల స్థాయిలో జరిగిన పరీక్షలకు 34 మంది వీఆర్వోలు, 24 మంది వీఆర్‌ఏలతోపాటు పరిపాలన సిబ్బంది, తహశీల్దార్ పరీక్ష రాశారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లొల్లలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

రాయవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): లొల్ల విశ్వమానవతా ఆశ్రమంలో విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విశ్వమానవతా సంస్థ అధినేత అల్లూరి శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని తల్లిదండ్రులు తమ పిల్లలను ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం శ్రీనివాస చౌదరి విద్యార్థులకు యోగా, సూర్యనమస్కారాలు, వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, ధ్యానం, భగవద్గీత పారాయణం, ఆరోగ్యం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజూ ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీనివాస చౌదరి తెలిపారు. శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మానవతా వలంటీర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్రమ్ కార్డుతో ఎన్నో ప్రయోజనాలు



రాయవరంలో ఈశ్రమ్ కార్డులను నమోదు చేసుకుంటున్న అసంఘటిత కార్మికులు

రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈశ్రమ్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని రాయవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టీఎస్ కార్తీక్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈశ్రమ్‌పై ప్రజలకు గ్రామసభను ఏర్పాటు చేశారు. టీఎస్ కార్తీక్ మాట్లాడుతూ ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

పహల్గాం ఉగ్ర దాడి అమానుషం



మండపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ ముస్లిం సంఘీయులు

మండపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకోవడంపై మండపేట పట్టణ ముస్లిం సంఘాలు మండిపడ్డాయి. ఈ మేరకు శుక్రవారం బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పలు నినాదాలు చేశారు. పట్టణ జేఏసీ ముస్లిం సోదరులు పెద్దమసీదు నుంచి ర్యాలీని ప్రారంభించి ప్రధాన వీధుల్లో కొనసాగించారు. ముస్లిం నాయకులు ఎండీ అతవూర్ రెహమాన్, సల్మాన్‌హుస్సేన్, ఎండీ ఖాదరీ ఖరీం, షేక్‌మౌలాలి, అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మౌలానా, అమీర్ షరీఫ్, షేక్‌మొహిద్దీన్ గౌస్, ఎండీ అర్షితోపాటు జేఏసీ నాయకులు కోనా సత్యనారాయణ, దూళి జయరాజు, హిందూ ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను ఖండిస్తూ రాయవరంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా పర్యాటకులకు నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. అనంతరం రాయవరం బస్టాండ్ వద్ద ఉన్న గాంధీ బొమ్మసెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్, నాయకులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కె.శ్రీదేవి, నరాల రాంబాబు, ఈరెళ్ల కృష్ణమూర్తి, అంగర జనార్ధన్, కరుటూరి శ్రీనివాస్, జనసేన నేత నాగేంద్ర, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పుంతలో ముసలమ్మ వారి జాతర

రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామదేవత శ్రీపుంతలో ముసలమ్మ వారి జాతర ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. దీనిలో భాగంగా ఆదివారం అమ్మవారి తీర్థమహోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని ఆలయ కమిటీ పిలుపునిచ్చింది.

పీసీసీ చీఫ్‌ను కలిసిన ప్రభాకరరావు

మండపేట, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యరావ్ ఠాకూర్‌ను రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, రైతు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

వేసవి బడుల సందర్శన



కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

మండపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలడుగు చంద్రమౌళి జడ్పీ బాలికల హైస్కూల్, ఏడిద జడ్పీ హైస్కూల్లో జరుగుతున్న వేసవిబడులను రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి వి. రామలక్ష్మణమూర్తి శుక్రవారం సందర్శించారు. ఈనెల 24 నుంచి మే 10 వరకు వేసవిబడులను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఏడిదలో ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు జాహ్నవి, విజయను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, చింతా సోమిరెడ్డి, ఉపాధ్యాయులు, ఎం.వెంకట్రాజు, స్వామి ప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో కొనసాగుతున్న మహిళ శాంతియుత దీక్ష

మండపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేశవరం జడ్పీ హైస్కూల్ ప్రహరీ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమ కార్యకర్త వల్లూరి శ్రీవాణి చేస్తున్న శాంతియుత దీక్ష శుక్రవారంతో 8వ రోజుకు చేరింది. గ్రామంలో రాజకీయాలు నేపథ్యంలో ప్రహరీ నిర్మాణానికి స్థానిక నాయకులు అడ్డుతగులుతున్నారని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా పాఠశాలకు చెందిన స్థలంపై సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించి ప్రహరీ నిర్మించి విద్యార్థుల సమస్య తీర్చాలని ఆమె ప్రభుత్వానికి ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రహరీ నిర్మించేంత వరకు దీక్ష కొనసాగించుతానని అంటున్నారు.

అంగరలో వసుంధరాదేవి ద్వితీయ వర్ధంతి



పడమరఖండ్రికలో చైతన్యను సన్మానిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పడమర ఖండ్రిక పీహెచ్‌సీ ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ అధినేత, ఎన్ఆర్ఐ డాక్టర్ బలుసు సుబ్బారావు ఏర్పాటు చేసిన నూతన బ్లాక్ వద్ద శుక్రవారం దివంగత బలుసు వసుంధరా దేవి ద్వితీయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జానకి రామయ్య వసుంధరాదేవి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పడమరఖండ్రిక గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త యర్రంశెట్టి వీర వెంకట వరలక్ష్మి కుమార్తె చైతన్య 10వ తరగతిలో 555 మార్కులు సాధించడంతో ఆమెను రూ.ఐదు వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీపై అప్రమత్తత అవసరం



మాచవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయం, పీహెచ్‌సీ, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య సిబ్బంది మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి వి. అనిరుథ్ మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఈ వ్యాధులు నిర్మూలన సాధ్యమౌతుందన్నారు. ఎంపీడీవో ఎన్. కీర్తి స్పందన మాట్లాడుతూ మండల పరిధిలో మలేరియా, డెంగీ జ్వరాల వ్యాప్తి జరగకుండా పటిష్టచర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.శంకర్, డాక్టర్ రమ్యశ్రీ, వైద్యఆరోగ్య సిబ్బంది సత్యవతి, టి. ఇమ్మాన్యుయల్, డి.మురళి, కె.కాంతారావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పేకేరు, దంగేరు గ్రామాల్లోని ఆసుపత్రుల వద్ద సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లోని ప్రజలకు మలేరియా రావడానికి గల కారణాలు చెబుతూ... తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా ఆసుపత్రుల వైద్యులు రేఖారాణి, శ్రీలక్ష్మి, రాజశేఖర్, వి. మంగాదేవి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మలేరియా అంతం మనతోనే అని మనతోపాటు ప్రజాప్రతినిధులను, ప్రజలను, మీడియాను భాగస్వాములుగా చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు, హెచ్ఈ రామారావు, హెచ్‌వీ మేరీమణి, ల్యాబ్‌టెక్నీషియన్ ఆలీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగరలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉగ్రవాద సంస్థలకు త్వరలోనే గుణపాఠం

- బీజేపీ రాష్ట్ర పతాధికారి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి
- పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి పలుచోట్ల నిరసన కార్యక్రమాలు



రామచంద్రపురంలో మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

రావులపాలెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మూ-కశ్మీర్ రాష్ట్రంలోని పెహల్గామ్‌లో అమాయకులైన పర్యాటకుల ప్రాణాలు తీసిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలకు త్వరలోనే భారత్ తగిన గుణపాఠం చెబుతుందని బీజేపీ రాష్ట్ర పతాధికారి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి తమలంపూడి రామకృష్ణారెడ్డి అన్నారు. రావులపాలెంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉగ్రదాడిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలంటూ సంతాపం తెలిపి మౌనం వ్యక్తం చేశారు. అలాగే పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారికి అశ్రునివాళులంటూ రాష్ట్ర సివిల్‌రైట్స్ సెక్రటరీ షేక్ అన్సారీ ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన ర్యాలీ చేపట్టారు.

రామచంద్రపురంలో ముస్లింల నిరసన

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా రామచంద్రపురం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన ప్రదర్శన జరిపారు. శుక్రవారం నమాజ్ అనంతరం జామియా మసీదు వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉగ్రవాదం నశించాలని, శాంతి వికసించాలని నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. జేఏసీ అధ్యక్షుడు అబ్దుల్ అహ్మద్, ఫరీద్ అహ్మద్‌లు మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రవాదుల దాడి పర్యాటకులపై కాదని యావత్తు భారతజాతిపై దాడిగా పేర్కొన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, ప్రతిష్టను దెబ్బ తీసే ప్రయత్నంతో చేసిన ఉగ్రదాడిని కులమతాలకు అతీతంగా భారతీయులందరూ ఒక్కటై దేశాన్ని రక్షించుకుంటామన్నారు. పర్యాటకులను రక్షించే ప్రయత్నంలో సయ్యద్‌హుస్సేన్ ప్రాణత్యాగం మరువలేనిదన్నారు. అలాగే శుక్రవారం రాత్రి రామచంద్రపురంలో ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.సిద్ధూ, రైతు కూలీ సంఘ నాయకులు వెంటపల్లి భీమశంకరం, అంబటి కృష్ణ పాల్గొన్నారు. అలాగే పెహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ మృతుల కుటుంబాలకు నివాళులర్పిస్తూ పట్టణంలో సెల్‌ఫోన్ షాపుల వర్కర్స్, ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎయిర్‌టెల్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో మానవహారం

ఆత్రేయపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురంలో మహాత్మాగాంధీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉగ్రవాదాన్ని అరికట్టాలని భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ పీఎస్ రాజు, ప్రిన్సిపాల్ బీవీఆర్, గాదిరాజు ప్రసాదరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో..

ఆలమూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులకు నిరసనగా జనసేన ఆధ్వర్యంలో మూడురోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆలమూరు బస్టాండు సెంటర్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతిని వ్యక్తంచేసి ఉగ్రవాదులకు నిరసనగా నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎన్డీయే ప్రభుత్వం పూర్తిగా తరిమి కొట్టాలని నినదించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, జన సైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రావులపాలెంలో నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లింలు



ఆత్రేయపురంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



ఆలమూరులో మానవహారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

సర్వీసు రోడ్ల ఆధునీకరణకు చర్యలు

సోలార్‌లైట్లు, డ్రైనేజీల ఏర్పాటుకు కృషి.. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామని, దీంతో జాతీయ రహదారి చెంతనే ఉన్న గ్రామాల ప్రజలకు, ప్రయాణికులకు త్వరలోనే కష్టాలు తీరనున్నాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రావులపాలెం ప్రభుత్వ కళాశాల వద్ద సర్వీస్ రోడ్ల ఆధునీకరణకు రూ.1.26 కోట్లు, అలాగే ప్రభుత్వ కాలేజీ, ఆర్టీసీ కాంప్లెక్స్, మల్లాయ్యదొడ్డి సెంటర్ వద్ద డబుల్ ఆర్మ్ సోలార్ లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆలమూరు మండలం మడికి కూరగాయల మార్కెట్ నుంచి చెముడులంక వైపు ఉన్న సర్వీస్ రోడ్డు, చెముడులంక నుంచి చొప్పెళ్ళ వైపు వరకూ, చొప్పెళ్ల లాకుల నుంచి మూలస్థానం వరకూ సర్వీస్ రోడ్లను రూ.13.79 కోట్లతో ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అలాగే చొప్పెళ్ల వద్ద సోలార్ లైట్లను ఏర్పాటుతోపాటు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సూచనల మేరకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో ఈ పనులు చేపట్టి పూర్తి చేయనున్నట్టు హైవే అధికారులు తెలిపారు. సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

- ఆత్రేయపురం పీహెచ్‌సీ డాక్టర్ సౌమ్య
- మలేరియా నివారణ దినం
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు



ఆత్రేయపురం పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఆత్రేయపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి ప్రబలకుండా దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి ఈ.సౌమ్య, ఐ.హేమశ్రీ చెప్పారు. ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణా దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ జరిపి మలేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అరుణకుమారి, సూపర్‌వైజర్లు సూర్యనారాయణ, విజయభాను పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బంది మలేరియా నివారణకు ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. మలేరియా వ్యాధి పట్ల తీసుకోవలసిన చర్యలు, నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమాలలో సీహెచ్‌వో ఎంఎస్ఎన్.రెడ్డి, ఎంపీహెచ్‌వో కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, వి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లకు నైపుణ్య పరీక్షలు

ఆత్రేయపురం/కొత్తపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మహాత్మా గాంధీ విద్యాసంస్థల ప్రాంగణం, ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ, సర్వే అంశాలపై నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ, సర్వేయర్లకు ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాన్ని తహశీల్దారు టి.రాజేశ్వరరావు, డీటీ తహశీల్దారు మూర్తి, ఆర్ఐ భాను పరిశీలించారు.

ఆయుర్వేద నిలయాన్ని సందర్శించిన కలెక్టర్



చింతలూరు ఆయుర్వేద నిలయం మేనేజింగ్ డైరెక్టర్ శ్రీరామమూర్తితో చర్చిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆలమూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద రంగానికి ఎంతో పేరుగాంచిన శతాబ్ది చరిత్ర కలిగిన చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేద నిలయాన్ని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం సం దర్శించారు. ఆయుర్వేద నిలయం మేనేజింగ్ డైరెక్టర్ ద్విభా ష్యం వెంకటశ్రీరామమూర్తితో ఆయుర్వేద మందుల తయారీ తదితర అంశాలపై చర్చించారు. మందుల తయారీలో వాడే సరుకులు, వనమూలికలు, వాటిని సేకరించే విధానాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. ఆయుర్వేద మందుల తయారీ విధానం వా టి ప్రత్యేకతలపై వివరాలు అడి గారు. ఫ్యాక్టరీలో మందుల త యారీ విధానాన్ని ఆయన స్వ యంగా పరిశీలించారు. కార్యక్రమంలో కొత్తపే ట ఆర్డీవో శ్రీకర్, తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటికి ఎద్దడి లేకుండా చర్యలు

ఆలమూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎ.రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రవికుమార్, ఏఈ పద్మ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ముఖ్యంగా ట్యాంకుల ద్వారా నీటి సరఫరా, కుళాయిలు రిపేర్లు, హ్యాండ్ పంపులు సక్రమంగా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా అసంపూర్తిగా ఉన్న పనులు తక్షణం పూర్తి చేయించాలని కోరారు. సమావేశంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.3.49 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,49,254 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి సికింద్రాబాద్‌కు చెందిన పెన్మత్స రాఘవేంద్ర పవన్‌వర్మ-హిమని దంపతులు రూ.50,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేసిన పెండల్స్ నిర్మాణ పనులను ఈవో పరిశీలించారు.